సాక్షి
ప్రకాశం
సోమవారం । 3 । జూన్ । 2024



పలుప్రాంతాల్లో వర్షాలు

రుతుపవనాల రాకతో జిల్లాలో పలుప్రాంతాల్లో ఆదివారం వర్షాలు కురిశాయి. పలు చోట్ల వడగండ్ల వాన పడింది. తర్లుపాడు, కంభం, మర్రిపూడిల్లో వర్షం పడింది. - 8లో..



దొంగల బీభత్సం

పెద్దదోర్నాలలోని ఓ ఇంట్లో దొంగలు పడి 5 సవర్ల బంగారం, రూ.95 వేల నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.5/27

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపిన కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధమయ్యామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. ఆదివారం వెలగపూడి నుంచి జిల్లా కలెక్టర్లతో కౌంటింగ్ ప్రక్రియపై వీడియో సమావేశం నిర్వహించారు. కచ్చితమైన ఫలితాలను త్వరగా అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ పాల్గొని జిల్లాలో తీసుకున్న చర్యలను వివరించారు. ఓట్ల లెక్కింపునకు నూరు శాతం సిద్ధంగా ఉన్నామన్నారు. కౌంటింగ్ కేంద్ర వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాల ద్వారా కూడా పక్కా పర్యవేక్షణ ఉంచుతున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని 34 మండలాల్లో 81 వసతి గృహాల్లో విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారిత అధికారి ఎన్ లక్ష్మానాయక్ తెలిపారు. జిల్లాలో ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహాలు 47, బాలికల వసతి గృహాలు 14 ఉన్నట్లు చెప్పారు. అందులో ప్రీ మెట్రిక్ వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు, 20 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో ఇంటర్మీయెట్ నుంచి పీజీ విద్యార్థుల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. జూన్ ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ జూనియర్ కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయా వసతి గృహాల్లో వసతి కావలసిన విద్యార్థులు, తల్లిదండ్రులు సంక్షేమ శాఖ ఏడు డివిజన్ కేంద్రాలు అయిన ఒంగోలు, కొండపి, దర్శి, కనిగిరి, మార్కాపురం, బేస్తవారిపేట, గిద్దలూరులలోని వసతి గృహ సంక్షేమ అధికారులను సంప్రదించాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో సాంఘిక సంక్షేమ శాఖలో విద్యను అభ్యసించిన 887 మంది పదో తరగతి విద్యార్థుల్లో 798 మంది ఉత్తీర్ణులయ్యారని, అందులో 76 మందికి పైగా 500 మార్కులు సాధించారని చెప్పారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఉత్తమ ప్రతిభా అవార్డులు, జ్ఞాపికలు అందించి ప్రోత్సహించారని చెప్పారు. జిల్లాలోని వసతి గృహాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మంచి మెనూ అమలు చేస్తున్నామని, తగిన సిబ్బంది ఉన్నారన్నారు.

తొలి ఫలితం ఎస్‌ఎన్‌పాడు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చివరి ఘట్టం అయిన ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ నెల 4వ తేదీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. వల్లూరు సమీపంలోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల్లో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

- ఓట్ల లెక్కింపునకు కౌంట్ డౌన్
- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓట్లు
- ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- కౌంటింగ్ జరిగే రైజ్ కాలేజీ వద్ద ట్రాఫిక్ మళ్లింపు, మూడంచెల భద్రత
- ఒక్కో హాలులో అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14, పార్లమెంట్ సెగ్మెంట్‌కు 14 టేబుళ్లు
- రాష్ట్రంలోనే మన జిల్లాలో అత్యధికంగా 87.24 శాతం ఓటింగ్ నమోదు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక కౌంటింగ్ రోజున మధ్యాహ్నం 2 గంటల తరువాత సంతనూతలపాడు నియోజకవర్గానికి సంబంధించిన ఫలితాలు తొలుత వెల్లడయ్యే అవకాశం ఉంది. తరువాత యర్రగొండపాలెం ఫలితం రానుంది. చివరిగా సాయంత్రం 6, 7 గంటలకు కనిగిరి నియోజకవర్గ ఫలితాలు ప్రకటిస్తారు. మే 13వ తేదీ జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలలో ఓట్లు నిక్షిప్తమై స్ట్రాంగ్ రూముల్లో పోలీసు పహారాలో భద్రంగా ఉన్నాయి. ఈనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. కౌంటింగ్‌లో సుమారు 2400 మంది కౌంటింగ్ ఏజెంట్లు, 1500 మంది కౌంటింగ్ సిబ్బంది, సుమారు వెయ్యి మంది పోలీసు సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొంటారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములు ఉన్న రైజ్ కాలేజీలోనే జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల ఓట్లను లెక్కించనున్నారు. ఆ మేరకు ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా...

తొలుత స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచిన ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా 17సితో పోల్ అయిన ఓట్లను మొత్తంతో సరిచూస్తారు. అనంతరం టేబుళ్లపై ఈవీఎంల్లోని రిజల్ట్ బటన్‌తో సీరియల్ నంబర్ల ప్రకారం పోలైన ఓట్లను లెక్కిస్తారు. ఓటు వేసేటప్పుడు వీవీప్యాట్‌లో పడిన స్లిప్‌లను ఒక్కో ఈవీఎంకు సంబంధించి ర్యాండమ్‌గా 5 స్లిప్‌లను మాత్రమే పరిశీలిస్తారు. ఏదైనా 17సి, ఈవీఎంలోని ఓట్లకు భారీ మొత్తంలో తేడా వచ్చి అటువంటి సమయంలో మాత్రమే స్లిప్‌లను పూర్తిగా లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు కోసం జిల్లాలోని అన్నీ నియోజకవర్గాలకు రైజ్ కాలేజీలో మూడు భవనాల్లో 25 కౌంటింగ్ గదులు ఏర్పాటు చేశారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, పార్లమెంట్ సెగ్మెంట్‌కు 14 టేబుళ్ల చొప్పున ఒక్కో గదికి మొత్తం 28 టేబుళ్లు



ఓట్ల లెక్కింపునకు సిద్ధం చేసిన కౌంటింగ్ హాళ్లు

ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు 5 టేబుళ్లు, పార్లమెంట్ సెగ్మెంట్‌కు 40 టేబుళ్లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం 8 నియోజకవర్గాలకు 8 మంది పరిశీలకులను నియమించింది. వీరితో పాటు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, 338 మంది మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ అసిస్టెంట్, టేబుల్ ఇన్‌చార్జ్‌లతో పాటు అభ్యర్థులు ఆయా పార్టీల ఏజెంట్లు ఉంటారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభించి అనంతరం ఈవీఎం ఓట్లను లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత మాత్రమే ఫలితాలు ప్రకటిస్తారు. జిల్లాలో అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2183 కంట్రోల్ యూనిట్‌లు, పార్లమెంట్‌కు 2183 కంట్రోలు యూనిట్‌లలో ఓట్లను లెక్కిస్తారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు ఒక రౌండ్‌కు సుమారు 30 నిమిషాల సమయం పడితే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఒక రౌండ్‌కు సుమారు 3 నుంచి 4 గంటల సమయం పడుతుంది. జిల్లాలో ఇప్పటికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా 23 వేల ఓట్లు ఉన్నాయి.

ఆయా నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలను బట్టి ఎన్ని రౌండ్ల ఓట్ల లెక్కింపు జరుగుతుందో నిర్ధయమవుతోంది. కనిష్టంగా 19 రౌండ్ల నుంచి గరిష్టంగా 21 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోలింగ్ రౌండ్లు
కనిగిరి	297	21
యర్రగొండపాలెం	265	19
దర్శి	282	20
సంతనూతలపాడు	256	19
ఒంగోలు	259	19
కొండపి	283	20
మార్కాపురం	257	19
గిద్దలూరు	284	20

కౌంటింగ్ ఏజెంట్‌లు
2400 మంది

కౌంటింగ్ సిబ్బంది
1500 మంది

మొత్తం కౌంటింగ్ హాళ్లు
25

హాలుకు ఓట్లు లెక్కించే టేబుళ్లు
28

ప్రత్యేక పార్కింగ్ స్థలాలు

కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించే రైజ్ కాలేజీ వద్ద ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కాలేజీ వైపు రోడ్డును మూసి వేసి ఒక రోడ్డులోనే రాకపోకలు జరిగేలా ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. అంతేకాకుండా ఎన్నికల సంఘం గుర్తింపు కార్డుతో హాజరయ్యే కౌంటింగ్ సిబ్బంది, ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్‌లు, మీడియా వంటి వారి కోసం వివిధ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఒంగోలు వైపు నుంచి వెళ్లే వారి కోసం వల్లూరు వద్ద, నెల్లూరు వైపు నుంచి వచ్చే వారి కోసం రైజ్ కాలేజీ దక్షిణం వైపు ప్రత్యేక పార్కింగ్‌లు ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రాంతం నుంచి కౌంటింగ్ ప్రాంగణం వరకు చేరవేసేలా ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ గదుల నుంచి కాలేజీ ప్రధాన గేట్ల వరకు మూడంచెల్లో భద్రత ఏర్పాటు చేశారు. ఎటువంటి ఆయుధాలు, మత్తు పదార్థాలు వంటివి ప్రాంగణంలోకి రాకుండా తనిఖీలు నిర్వహించడంతో పాటు అనుమానితులకు బ్రీత్ ఎనలైజర్ టెస్టులు నిర్వహించేలా చర్యలు చేపట్టారు.



ఒంగోలు సెయింట్ జేవియర్స్ హైస్కూల్ పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలో బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

జిల్లాలో 87.24 శాతం ఓటింగ్ నమోదు

మే 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రకాశం జిల్లా అత్యధికంగా 87.24 శాతం ఓటింగ్ నమోదు కావడం అభినందనీయం. దర్శిలో అత్యధికంగా 91 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 18,22,470 మంది ఓటర్లు ఉండగా అందులో 15,89,866 మంది ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో జిల్లాలో 87.24 శాతం ఓటింగ్ నమోదైంది.

ఈవీఎంల్లో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఓటు వేసిన పురుషులు	ఓటు వేసిన మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
యర్రగొండపాలెం	265	93944	91296	2	185242	89.4
దర్శి	282	104129	101940	1	206070	91.03
సంతనూతలపాడు	256	92589	95130	2	187721	87.46
ఒంగోలు	259	98711	105434	40	204185	84.99
కొండపి	283	105512	106273	2	211787	88.39
మార్కాపురం	257	95139	93009	7	188155	87.67
గిద్దలూరు	284	99936	102373	15	202324	84.40
కనిగిరి	297	104264	100111	7	204382	87.13
మొత్తం	2183	794224	795566	76	1589866	87.24

3 నుంచి 5వ తేదీ సాయంత్రం వరకు 144 సెక్షన్

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు కాపాడేందుకు జిల్లాలో జూన్ 3 నుంచి 5వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు రోజు, ముందు రోజు తర్వాత రోజు ఈ సెక్షన్ అమలులో ఉండటంతో పాటు మద్యం అమ్మకాలు నిలుపుదల చేస్తారు. ఈ నేపథ్యంలో ఎక్కడా నలుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమికూడటం, బహిరంగ సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా పేల్చడం వంటివి చేయకూడదు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా అందిన ఓట్లు

పోస్టల్ బ్యాలెట్‌లు వృద్ధులు, వికలాంగులు, ఉద్యోగులు పోలింగ్‌కు ముందే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. అయితే సర్వీస్ ఓటర్లకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌లు రిజిస్టర్ పోస్టు ద్వారా ఈ నెల 4వ తేదీ ఉదయం 8 గంటల వరకు స్వీకరిస్తారు. ఇప్పటి వరకు సుమారు 2200 వరకు సర్వీసు ఓటరు పోస్టల్ బ్యాలెట్‌లు జిల్లా ఎన్నికల అధికారులకు అందాయి. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌లు 17,468, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 69, వికలాంగులు 750 మందికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఓట్ల లెక్కింపునకు సిద్ధం చేసిన కౌంటింగ్ హాళ్లు

నియోజకవర్గం	వృద్ధులు (85ఏళ్ల పైబడి)	దివ్యాంగులు	ఉద్యోగులు
వై.పాలెం	70	72	1669
దర్శి	43	67	1752
ఎస్ ఎన్ పాడు	97	82	1726
ఒంగోలు	278	209	4161
కొండపి	77	75	1642
మార్కాపురం	56	113	2595
గిద్దలూరు	112	178	3260
కనిగిరి	55	36	2389
మొత్తం	788	832	19,194



ఓట్ల లెక్కింపునకు పక్కా చర్యలు

ఓట్ల లెక్కింపు (కౌంటింగ్)నకు సంబంధించి పక్కాగా ఏర్పాట్లు చేశాం. కౌంటింగ్‌లో ఎటువంటి అవరోధాలు లేకుండా స్పష్టంగా నిర్వహించేలా అన్నీ చర్యలు తీసుకున్నాం. కౌంటింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చాం. కౌంటింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పటిష్టమైన మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు కౌంటింగ్ కూడా జరిగేలా చర్యలు చేపట్టాం. కౌంటింగ్ ప్రకియ మొత్తం క్షుణ్ణంగా పర్యవేక్షించేలా 190 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు బందోబస్తుతో పటిష్టంగా నిర్వహిస్తాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

కౌంటింగ్ సజావుగా జరిగేలా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్

ఒంగోలు సిటీ: ఈనెల 4వ తేదీ జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, సజావుగా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్.దినేష్‌కుమార్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఆదివారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్.దినేష్‌కుమార్ జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు అరవింద్‌కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహతా, గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గాల అబ్జర్వర్స్ ఐటినోలిన్ మావ్లాంగ్, బీరేంద్ర కోర్కోరా, అనిమేష్ డెబ్బర్మ, డాక్టరు బాబుగోపినాథ్ పవార్‌లతో కలిసి ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అబ్జర్వర్లు అరవింద్ కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహతా మాట్లాడుతూ ఈ నెల 4న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ కౌంటింగ్ విధులకు కేటాయించిన సిబ్బంది 4వ తేదీ ఉదయం 5 గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకునేలా ఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని కౌంటింగ్ హాల్‌లోకి సెల్‌ఫోన్లు అనుమతించవద్దన్నారు. కౌంటింగ్ సిబ్బంది, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు చేయాల్సిన విధులకు సంబంధించి ముఖ్యమైన అంశాలపై చెక్‌లిస్టులు రూపొందించి వారికి అందించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి టెన్షన్ వాతావరణం లేకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగిలా ఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబంధిత రిటర్నింగ్ అధికారుల ఆదేశాల సూచనలు మేరకు బందోబస్తు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలస్వామి, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీన, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

జనార్దన్..నోరు అదుపులో పెట్టుకో



రైల్వేస్టేషన్‌లో బాలినేనికి ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు

- దామచర్ల వ్యాఖ్యలపై బాలినేని ఫైర్
- సంస్కారంతో మాట్లాడాలని హితవు
- ఒంగోలులో బాలినేనికి ఘన స్వాగతం

ఒంగోలు: సమతానగర్ గొడవ జరిగి రెండు నెలలు అవుతుంటే అప్పుడు మాట్లాడకుండా ఇప్పుడు జనార్దన్ మాట్లాడడం గమనించాలని.. మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఆడవాళ్ల మీద రౌడీషీట్ పెట్టాలా...సంస్కారం ఉండే మాట్లాడుతున్నావా అంటూ భగ్గుమన్నారు. ఓటమి భయంతో మైండ్ దొబ్బిందా అని ప్రశ్నించారు. పోలింగ్ అనంతరం తొలిసారిగా ఒంగోలుకు వచ్చిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఆదివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి ఒంగోలుకు వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతించారు. అక్కడ నుంచి నేరుగా ఇంటికి చేరుకున్న బాలినేని మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ''అసలు ఆరోజు హాస్పిటల్‌లో మీ పార్టీ నాయకుడికి వైద్యం అందించాల్సింది పోయి దెబ్బలతో ఉన్న మా పార్టీ కార్యకర్తలను ఎందుకు బెదిరించావు. మీరు అలా చేశారు కాబట్టే వాళ్లు నాకుఫోన్ చేశారు. అందుకే నేను ఆస్పత్రికి రావాల్సి వచ్చింది. నేను వెళ్లానని తెలిసి మావాళ్లు వచ్చారు. అయినా నిత్యం మీ స్వార్థం చూసుకునే మీ వెంట వచ్చేవారు ఎవరూ ఉండరు. కానీ మేము అందరి సంక్షేమం,



మీడియాతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

అందరూ బాగుండాలని కోరుకుంటాం కాబట్టే మేము పిలవకుండానే పెద్ద ఎత్తున జనం వచ్చారు. మీకు అప్పులు ఇచ్చిన వారు తీవ్రంగా వేదన చెందుతున్నారు. ముందు వాళ్ల అప్పులు తీర్చి వారు ఆత్మహత్య చేసుకోకుండా చూసుకో.. లేకుంటే మీపై క్రిమినల్ కేసులు వాళ్ల కుటుంబాలే నమోదు చేస్తాయని గుర్తుంచుకో.. మీ కుటుంబ సభ్యులు ప్రచారంలో తిరిగారు, మేము ఎక్కడైనా ఒక్క మాట మాట్లాడామా...కనీస సంస్కారం కూడా లేకుండా ఆడవాళ్ల మీద రౌడీషీట్ తెరవమంటావా...సిగ్గు, సంస్కారం ఉండే మాట్లాడుతున్నావా'' అంటూ ప్రశ్నించారు. పిల్లలను ఇష్టం వచ్చినట్లు కొడుతుంటే మా కోడలు కొట్టొద్దంటూ చేతితో నెడితే రౌడీషీట్ పెట్టమంటావా అంటూ మండిపడ్డారు.

పశ్చిమ గోదావరిపై ప్రకాశం జట్టు గెలుపు



క్రాంతికుమార్

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూలపాడు ఏసీఏ గ్రౌండ్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల వన్‌డే క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ప్రకాశం జిల్లా జట్టు 43 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 314 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్స్ క్రాంతికుమార్ 69 బంతుల్లో 106 పరుగులు, క్రాంతికిరణ్ 124 బంతుల్లో 102 పరుగులు చేయడంతో జట్టు భారీ స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జిల్లా జట్టు 43 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 214 పరుగుల చేసి 100 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

క్లుప్తంగా

మహిళపై హత్యాయత్నం

కారంచేడు: కారంచేడు పుట్టాయిపాలెం ప్రాంతానికి చెందిన వివాహితపై అదే ప్రాంతానికి చెందిన పీ వీరాంజనేయులు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ మేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆ మహిళ ఫిర్యాదు చేసింది. ఎస్సై కే సురేష్ అందించిన సమాచారం మేరకు.. పుట్టాయిపాలెం (గంగమ్మగుడి సెంటర్) ప్రాంతానికి చెందిన మహిళ.. తన గేదె తప్పిపోవడంతో శనివారం మధ్యాహ్నం వెతకడానికి ఆదిపూడి రోడ్డులోని వీరతాళ్లకుంట వైపునకు వెళ్లింది. దీంతో అక్కడున్న వీరాంజనేయులు ఆ మహిళను వెంబడించి పట్టుకుని దాడి చేసి కిందపడేశాడు. దుర్భాషలాడి అసభ్యకరంగా మాట్లాడాడు. తన కోరిక తీర్చమని వేధించగా ఆమె కేకలు పెట్టింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని మహిళ అనడంతో అతడు పారిపోతూ నీ అంతు చూస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని త్వరలో పట్టుకుని కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

వాస్మోల్ తాగి వివాహిత ఆత్మహత్యాయత్నం

అద్దంకి: హెయిర్‌డైలో వ్యాస్మోల్ కలుపుకుని తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అద్దంకి పట్టణంలోని ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఆదివారం జరిగింది. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన కుంచాల మంజులది ఏల్చూరు గ్రామం. కొంతకాలంగా భర్త అంకమ్మరావుతో కలిసి పట్టణంలోని పాత శివాలయం సమీపంలో ఉంటున్నారు. భర్త బేల్దారి పనులు చేస్తుంటాడు. వీరిద్దరూ తరచూ గొడవపడుతుంటారు. ఈ క్రమంలో ఆదివారం ఇద్దరూ గొడవపడ్డారు. ఆమె బజారుకు వెళ్లి హెయిర్‌డై కొనుగోలు చేసి అందులో వాస్మోల్ కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన బంధువులు 108కి సమాచారం అందించడంతో తొలుత ఆమెను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.



తర్లుపాడు : నేలకొరిగిన విద్యుత్ స్తంభం



తర్లుపాడు : రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు

పలు ప్రాంతాల్లో వర్షాలు

- తర్లుపాడులో ఈదురుగాలులతో కూడిన వర్షానికి కూలిన విద్యుత్ స్తంభం

తర్లుపాడు: రుతుపవనాల రాకతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షాలు కురిశాయి. తర్లుపాడు మండలంలోని తర్లుపాడు, తుమ్మలచెరువు, మీర్జపేట, జగన్నాథపురం తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అక్కడక్కడా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తర్లుపాడులో కొన్నిచెట్లు రోడ్డుమీద పడ్డాయి. విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపోయాయి. గత నెల రోజులుగా తీవ్ర వేడిమితో ఇబ్బందిపడిన ప్రజలకు ఆదివారం సాయంత్రం చల్లటిగాలులతో కూడిన వర్షం పడటంతో ఉపశమనం పొందారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టారు.

కంభంలో వడగండ్లవాన

కంభం: కంభంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా గాలులు, వర్షంతో వాతావరణం చల్లబడింది. తీవ్రగాలులతో పలు చోట్ల రేకుల షెడ్లు, విద్యుత్ తీగలు తెగిపోయాయి. మూడు రోజులుగా తీవ్ర ఎండలకు విలవిల్లాడిన ప్రజలు సుమారు గంట సేపు వర్షం కురిసి వాతావరణం చల్లబడటంతో సేదతీరారు.



కంభంలో కురుస్తున్న వర్షం

పిడుగుపాటుకు గేదె మృతి

మద్దిపూడి: పిడుగుపాటుకు ఒక పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మద్దిపూడి మండలంలోని పొట్టిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది. బాధిత పాడి రైతు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పొట్టిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన చెన్నారెడ్డి రమణారెడ్డికి మూడు గేదెలు ఉన్నాయి. వాటిని ఇంటి ముందున్న వేపచెట్టు కింద కట్టేశాడు. ఆదివారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా పిడుగు పడటంతో ఇంటి బయట చెట్టుకు కట్టేసి ఉన్న పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని చెన్నారెడ్డి రమణారెడ్డి తెలిపారు.



మృతిచెందిన గేదె

యోగాతో ఆత్మవిశ్వాసం

ఒంగోలు టౌన్: నిరంతరం నిష్టతో యోగా, ధ్యానం చేయడం వలన ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుందని ధ్యానం పిరమిడ్ అధ్యాపకుడు కాశీ విశ్వనాథ్ తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ధ్యానం, యోగాలో శిక్షణ ఇచ్చారు. 30 నిముషాల పాటు ధ్యానం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి, ఆందోళనల నుంచి కాపాడుకునేందుకు ఏకైక మార్గంగా ధ్యానం ఉపయోగపడుతుందన్నారు. సెల్‌ఫోన్లతో ఆరోగ్యాన్ని, భవిష్యత్తుని పాడుచేసుకోకుండా ధ్యానం లాంటి మంచి అలవాట్లు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. జీవితంలో విజయం సాధించాలంటే భావోద్రేకాలు, భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాలన్నారు. ధ్యానం అలవాటు చేసుకుంటే అన్ని రకాల ఉద్రేకాలు, ఉద్వేగాలను జయించవచ్చన్నారు. అలాగే యోగాతో పాటు చిన్నారులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, డి.సందీప్, ఇమ్మానియేలు, ఎస్.అనిల్‌బాబు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయంలో ధ్యానంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

లెనిన్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

ఒంగోలు టౌన్: మార్క్సిజం ప్రపంచవ్యాప్తం కావడంలో లెనిన్ పోషించిన పాత్ర గణనీయమైందని, లెనిన్ చేసిన గతి తార్కిక చారిత్రక పరిశీలన నేటికీ అవసరమని విరసం రాష్ట్ర నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. లెనిన్ 100వ వర్ధంతి సందర్భంగా నగరంలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మార్క్సిజం అభివృద్ధిలో లెనిన్ పాత్ర అనే అంశంపై నగరంలోని మాదాల నారాయణ స్వామి భవనంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆ సంస్థ జిల్లా కార్యదర్శి సాగర్ అధ్యక్షత వహించారు. కారల్ మార్క్స్ గ్రామాలను విముక్తి చేయడం ద్వారా చైనా విప్లవాన్ని విజయవంతం చేశారని తెలిపారు. కార్మిక వర్గం స్వీయ నాయకత్వంతో భూగోళంపై తొలి కమ్యూనిస్టు రాజ్యాన్ని లెనిన్ స్థాపించారని చెప్పారు. రష్యాలో లెనిన్ అనుసరించిన విధానాలను నేటి తరం అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రాజశేఖర్, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విరసం రాష్ట్ర నాయకుడు ప్రసాద్

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కంభం: ఇన్నోవా కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం అనంతపురం–అమరావతి హైవే రోడ్డుపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. మార్కాపురం నుంచి కంభం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు జంగంగుంట్ల సమీపంలో మార్కాపురం వైపు వెళ్తున్న ఇన్నోవా కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ఓ వైపు నుజ్జునుజ్జవా ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. హైదరాబాద్‌కు చెందిన 8 మంది కుటుంబసభ్యులు గోల్డెన్ టెంపుల్‌ను సందర్శించుకొని అనంతరం శ్రీశైలం వెళ్తూ మార్గమధ్యంలో ప్రమాదం జరిగినట్లు తెలిసింది.



ప్రమాదంలో నుజ్జయిన కారు

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో చీరాల సత్తా



విజేత జట్టుకు ట్రోఫీ, నగదు అందజేస్తున్న నిర్వాహకులు

నాగులుప్పలపాడు: విద్యానగర్ వారి ఆధ్వర్యంలో జేవైఎస్, రాజేష్ ఫ్రెండ్స్ సహకారంతో సర్దార్ వల్లభాయ్ పటేల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఉత్కంఠగా ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చీరాల కోటి ఫ్రెండ్స్, విద్యానగర్ సీనియర్స్ జట్ల మధ్య జరిగిన పోరులో కోటి ఫ్రెండ్స్ విజేతగా నిలిచి ప్రథమ బహుమతి రూ.40,116 అందుకుంది. రెండో బహుమతి విద్యానగర్ సీనియర్ జట్టు, మూడో బహుమతి 11 బుల్లెట్స్, నాల్గవ బహుమతి బూరేపల్లి యూత్ జట్టు వరుసగా రూ.30,116, రూ.20,116, రూ.10116 అందుకున్నారు. విజేతలకు దాతలైన విద్యానగర్ యూత్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మద్దిసాని నాగేశ్వరరావు చేతుల మీదగా అందజేశారు. గద్దె శేషయ్య, నాగమల్లేశ్వరరావు, కామిశెట్టి నాగరాజు, వినోద్ తదితరులు ఉన్నారు.

పశ్చిమ ప్రకాశంపై ఫోకస్

- 100 సీసీ కెమెరాల ఏర్పాటు
- 350 మంది అదనపు పోలీసు బలగాలు
- డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ
- 400 మందిపై బైండోవర్ కేసులు
- డీఎస్పీ బాలసుందరరావు

మార్కాపురం: కౌంటింగ్ సందర్భంగా పశ్చిమ ప్రకాశంలో ఎటువంటి గొడవలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించినట్లు డీఎస్పీ ఎం బాలసుందరరావు తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో 40 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, ఇందుకోసం 350 మంది అదనపు పోలీసు బలగాలను డివిజన్‌కు రప్పించి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. కౌంటింగ్ అనంతరం ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. డివిజన్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని, 30 పోలీసు యాక్టును అమల్లోకి తెచ్చామన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలపై నిషేధం ఉందన్నారు. కౌంటింగ్ అనంతరం కూడా ప్రశాంతంగా ఉండాలన్నారు. పశ్చిమ ప్రకాశంలో ఇప్పటివరకూ 400 మంది ట్రబుల్స్ మ్యాన్స్‌పై, 360 మంది రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేసి వారి కదలికలపై నిఘా పెట్టామన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ బాల సుందరరావు

రంగంలోనికి 25 మొబైల్ పార్టీలు..

డివిజన్ వ్యాప్తంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ ఎటువంటి గొడవలు జరగకుండా 25 మొబైల్ పార్టీలను రంగంలోకి దించామన్నారు. వీరు తరుచూ గ్రామాల్లో తిరుగుతుంటారన్నారు. ఒంగోలు నుంచి 350 మంది అదనపు సిబ్బంది వచ్చారని తెలిపారు. ప్రధాన పట్టణాల్లో డ్రోన్స్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కంభం తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు, మారణాయుధాలను గుర్తిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని డీఎస్పీ బాలసుందరరావు కోరారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ చేసి అనుమతిలేని వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. గెలుపెవరిదైనా ప్రజలు మాత్రం ప్రశాంతంగా ఉండాలని ఆయన సూచించారు.

అంతర్జాతీయ బీచ్ వాలీబాల్‌లో వెండి పతకం



వెండి పతకం సాధించిన ఇండియా టీం



బీచ్ వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న నాగరాజు

వేటపాలెం: చైనాలో జరిగిన పారా ఒలంపిక్స్ బీచ్ వాలీబాల్ పోటీల్లో దేశం వెండి పతకం సాధించింది. ఈనెల 28 నుంచి జూన్ 02వ తేదీ వరకు చైనాలో అంతర్జాతీయ బీచ్‌వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో వేటపాలెం మండలం పందిళ్లపల్లికి చెందిన దివ్యాంగ క్రీడాకారుడు పిచ్చుక నాగరాజు ఇండియా టీం తరపున కెప్టెన్‌గా వ్యవహరించాడు. పేద కుటుంబంలో జన్మించిన నాగరాజు ఈ పోటీలకు వెల్లడానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. పలువురు దాతలు నాగరాజుకు ఉదారంగా ఆర్థిక సహకారం అందించారు. దాతల ఆర్థిక సహకారంతో చైనాలో జరిగిన అంతర్జాతీయ బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొని వెండిపతకం సాధించి ఔరా అనిపించాడు. పతకం సాధించిన నాగరాజును పలువురు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయిలో రాణించిన నాగరాజు

పందిళ్లపల్లికి చెందిన నాగరాజు చిన్నతంలోనే ప్రమాదవశాత్తు ఒక చేయి కోల్పోయాడు. అయితే చిన్నప్పటి నుంచే వాలీబాల్ క్రీడపై ఉన్న మక్కువ, పట్టుదలతో వాలీబాల్ నేర్చుకొన్నాడు. స్కూల్, కాలేజీ స్థాయిల్లో అనేక వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాడు. మొదటిలో హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన దివ్యాంగ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాడు. 2009లో చెన్నైలో జరిగిన జరిగిన జాతీయ స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఉమ్మడి రాష్ట్రం తరపున పాల్గొన్నాడు. ఆ తరువాత కాంబోడియా దేశంలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 2010లో జరిగిన పోటీల్లో రెండోసారి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అప్పుడు జరిగిన అంతర్జాతీయ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. 2011లో జర్మనీలో జరిగిన బీచ్‌వాలీబాల్ పోటీల్లో ఇండియా టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించారు. అనంతరం బెంగళూరులో జరిగిన శ్రీలంకతో జరిగిన ఫ్రెండ్లీ వాలీబాల్ పోటీల్లోనూ పాల్గొన్నాడు. తదనంతరం ఆర్థిక ఇబ్బందులతో పోటీల్లో పాల్గొనటం నిలిపి వేశాడు. తరువాత 2013లో జరిగిన వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరుపున జాతీయ పోటీలకు ఎంపికై ఈ పోటీల్లో నాలుగో స్థానం సాధించాడు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

బల్లికురవ: గ్రామంలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే కార్మికుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆదివారం అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిలోని కొప్పరపాడు గ్రామ సమీపంలో జరిగింది. కొప్పరపాడు గ్రామానికి చెందిన పందిరి పిచ్చయ్య (46) సుగాలీతండాలో చెత్త సేకరణకు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య వెంకటరమణ, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే పిచ్చియ్యను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించడంతో బంధువులు, కాలనీ వాసులు భోరున విలపించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ బండారు వెంకాయమ్మ గురవయ్య, కేవీ అనిల్‌కుమార్ భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. హైవే అధికారులు రోడ్డు అభివృద్ధిలో భాగంగా రహదారిని కొప్పరపాడు గ్రామ సమీపంలో మూసివేసి ఒక వైపు నుంచి రాకపోకలు కొనసాగించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు. భార్య వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎస్సై రవిశంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పిచ్చయ్య



పిచ్చయ్య (ఫైల్)

జిల్లాకు 1981 సర్వీస్ ఓట్లు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సర్వీస్ ఓట్లు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

ఒంగోలు సిటీ: జిల్లాకు జూన్ 2వ తేదీ నాటికి 1981 సర్వీస్ ఓట్లు వచ్చినట్లు జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.ఝాన్సీలక్ష్మి తెలిపారు. ఆదివారం ఒంగోలు కలెక్టరేట్‌లోని జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ చాంబర్‌లో పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్‌కు సంబంధించి 85 సర్వీస్ ఓట్లు వచ్చాయని, వచ్చిన సర్వీస్ ఓట్లను సీసీ కెమేరా, ప్రభుత్వ వీడియో సమక్షంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపించి ఎన్ని వచ్చాయో లెక్కించి పోస్టల్ బ్యాలెట్ బాక్సులో వేయడం జరిగిందని తెలిపారు. మొత్తం సర్వీస్ ఓట్లు 6693కుగానూ జూన్ 2వ తేదీ ఆదివారం నాటికి మొత్తం 1981 ఓట్లు వచ్చాయని తెలిపారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల వరకు రోజువారీగా వచ్చిన సర్వీస్ ఓట్లను భద్రపరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎలక్షన్ రిప్రజెంటేటివ్ దామరాజు క్రాంతికుమార్, బి.రాజశేఖర్, కొమ్ము యోహాను, గుర్రం సత్యం, ఏడుకొండలు, రమణారెడ్డి, వై.కొండారెడ్డి, సూర్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

దొంగల బీభత్సం



చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్‌టీం



దొంగతనం జరిగిన బీరువాను పరిశీస్తున్న ఎస్సై రమణయ్య

పెద్దదోర్నాల: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దొంగలు పడి బంగారంతో పాటు కొంత నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మండల కేంద్రంలోని 2వ సచివాలయం పక్కనున్న నివాస గృహంలో జరిగింది. సంఘటన రెండు రోజుల క్రితం చోటు జరగ్గా.. శనివారం రాత్రి వెలుగు చూసింది. ఎస్సై అంకమరావు కథనం మేరకు..మండల కేంద్రంలో నివాసముంటున్న త్రిపురాంతకం ఎంఈఓ మల్లికార్జుననాయక్ వేసవి సెలవుల్లో భాగంగా గత నెల 28 కుటుంబసమేతంగా బంధువుల ఇంటికి వెళ్లారు. నాలుగు రోజులు తరువాత ఈ నెల ఒకటిన తిరిగి ఇంటికి వచ్చారు. అయితే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో సీసీ కెమెరాలకు ఉన్న వైర్లను తెంచి ఉండటంతోచోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటనా స్థలికి చేరుకున్న ఎస్సై అంకమరావు పరిసరాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేంద్రం నుంచి క్లూస్ టీంరప్పించి సంఘటనా స్థలంలో ఉన్న వేలిముద్రలు సేకరించారు. దుండగులు 5 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు రూ.95 వేల నగదు అపహరించినట్లు ఎస్సై అంకమరావు తెలిపారు.

కొత్తపాలెంలో చోరీ

తాళ్లూరు(ముండ్లమూరు): మండంలోని కొత్తపాలెం గ్రామంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కోట సుబ్బారెడ్డి ఇంట్లోకి దుండగులు ప్రవేశించి బీరువా తాళాలు పగులకొట్టి అందులోని సుమారు ఏడు సవర్ల బంగారు ఆభరణాలను అపహరించారు. ఈ మేరకు యజమాని కోట సుబ్బారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వైవీ రమణయ్య గ్రామానికి వెళ్లి దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, ఫింగర్‌ప్రింట్ టీంలు రంగంలోకి దిగి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.